సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



రిమ్స్‌కు మరో 19 పీజీ వైద్య సీట్లు

కడప ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)కు మూడు విభాగాల్లో 19 పీజీ వైద్య విద్య సీట్లు మంజూరయ్యాయి. - 8లో



గంజాయి ముఠా ఆటకట్టు

గుర్రంకొండలో గంజాయి విక్రయిస్తున్న 12 మంది ముఠా సభ్యుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.92
రెండోరకం	రూ.50	రూ.72



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 210 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	370
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 18.50 కిలోలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సహర్ గురు (ఉ॥)
రాజంపేట	6.33	4.43
రాయచోటి	6.33	4.43
మదనపల్లె	6.34	4.45
పీలేరు	6.30	4.47

నిరుపేదల నేస్తం

అగ్రవర్ణాల్లోని పేద మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు గల మహిళలు స్వయం శక్తితో రాణించేలా వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈబీసీ నేస్తం పథకం ద్వారా ఆర్థికంగా చేయూతనందిస్తోంది. గత ఏడాది తొలి విడత ఒక్కొక్కరు రూ.15 వేలు అందుకోగా నేడు మహిళల ఖాతాల్లో మలి విడత మొత్తం జమ కానుంది.



- నేడు వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద రెండో విడత 24,713మందికి రూ.37.06 కోట్లు అందజేత
- 45–60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న అగ్రవర్ణ మహిళలు అర్హులు
- ప్రతి ఏడాది రూ.15వేలు అందిస్తున్న జగన్ సర్కార్



సాక్షి రాయచోటి : రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. మరో పక్క స్వయం ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రోత్సహిస్తోంది. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూతలతోపాటు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాల ద్వారా మహిళలను ఆదుకుంటోంది. ఒక్క పథకాల ద్వారానే కాకుండా రాజకీయ, ఇతర పదవుల్లోనూ పెద్ద పీట వేస్తున్న జగన్ సర్కార్ అగ్రవర్ణ మహిళలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద అకౌంట్లలో జమ చేయనుంది.

వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకానికి సంబంధించిన సమాచారం

నియోజకవర్గం	మహిళలు	మొత్తం నగదు
రైల్వేకోడూరు	4505	రూ.6,75,75,000
రాజంపేట	4478	రూ.6,71,70,000
రాయచోటి	3596	రూ.5,39,40,000
మదనపల్లె	3056	రూ.4,58,40,000
పీలేరు	3783	రూ.5,67,45,000
తంబళ్లపల్లె	5295	రూ.7,94,25,000
మొత్తం	24,713	రూ.37,07,00,000

రెండవ విడత 24,713 మందికి..

అన్నమయ్య జిల్లాలో రెండవ విడత వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద మొత్తాలను జమ చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. అందులో భాగంగా జిల్లాలోని 24,713 మందికి రూ.37.06 కోట్ల మొత్తాన్ని బుధవారం జమ చేయనున్నారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం తొలి విడతకు సంబంధించి 2021–22లో 21,272 మంది మహిళలకు రూ.32.50కోట్లను అందజేశారు. అగ్ర వర్ణాలలోని పేద మహిళలకు ఏడాదికి రూ.15వేల చొప్పున మూడు విడతలలో రూ.45వేలు అందించనుంది.

పేద మహిళలకు ఆర్థిక చేయూత

జిల్లాలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ చెరగని ముద్ర వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అగ్రవర్ణాలలోని పేద మహిళలకు ఈబీసీ నేస్తం ద్వారా ఇతోధికంగా సాయపడుతున్నారు. ప్రభుత్వం మూడు విడతలలో అందించే రూ.45వేల సొమ్ముతో స్వయం ఆర్థికాభివృద్ధి సాధించాలన్నది లక్ష్యం. ఇప్పటికే తొలి విడత అందించగా.. మలి విడత బుధవారం అందజేయనున్నారు. మూడో విడత వచ్చే ఏడాది ఆరంభంలోనే అందించనున్నారు.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



అన్నమయ్య జిల్లాలోని అగ్రవర్ణాలలోని పేద మహిళలకు ప్రభుత్వం ఈబీసీ నేస్తం కింద అందించే సొమ్మును సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో 24,713 మంది మహిళలకు రూ.37.06కోట్లు జమ చేయనున్నాం. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సదస్సు ద్వారా మహిళలకు చెక్కు అందించనున్నాం. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డీబీటీ ద్వారా విడుదల చేయగానే ఇక్కడ మహిళల ఖాతాల్లో జమ అవుతుంది.

– గిరీషా పీఎస్, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

పూలే స్ఫూర్తితో బడుగులకు పెద్దపీట

- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు
- రైల్వేకోడూరులో ఘనంగా జ్యోతిరావుపూలే విగ్రహావిష్కరణ

రైల్వేకోడూరు: జ్యోతిరావు పూలే స్ఫూర్తితో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం రైల్వేకోడూరు పట్టణంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా పెద్దపీట వేస్తూ వారిని ఆర్థికంగా , సామాజికంగా ముందుకు తీసుకువెళ్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషిచేసిన పూలే జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గుంటూరు ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ పూలే ఆశయ సాధన కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి తపించేవారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని అనేక కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. నేడు అదే కోవలో ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందితేనే నిజమైన ప్రజాస్వామ్యం వస్తుందనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారన్నారు.జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషిచేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. కడప నగర మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ శతాబ్దాల క్రితమే దేశంలో కులవ్యవస్థ నిర్మూలన కోసం పోరాడి బడుగు, బలహీనుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిన పోరాట యోధుడు పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట సాయి, గునిశెట్టి ప్రశాంతి రమేష్, బీసీ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు ఈశ్వరయ్య, బుజ్జమ్మ, ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమన వర్మ, చెవ్వు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, మల్లెం ఈశ్వరయ్య పర్యవేక్షించారు.



పూలే విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల, ఎమ్మెల్సీ ఏసురత్నం, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, కడప మేయర్ సురేష్‌బాబు

న్యూస్‌రీల్

ఇద్దరు బీఎల్‌ఓల సస్పెన్షన్

మదనపల్లె : ఎన్నికల విధుల్లో భాగంగా ఫారం –6బీ సేకరణ, ఆధార్ లింకేజీలో నిర్లక్ష్యం కనబరిచినందుకు మండలంలోని కోళ్లబైలు, మాలేపాడు బీఎల్‌ఓలను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్ ఉత్తర్వులు జారీచేసినట్లు తహసీల్దార్ సీకే శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఫారం–6బీకు సంబంధించి పోలింగ్ స్టేషన్ నంబర్ 7 బీఎల్‌ఓగా వ్యవహరిస్తున్న కోళ్లబైలు డిజిటల్ అసిస్టెంట్ వి.మోహన్, పోలింగ్ స్టేషన్ నంబర్ 28 బీఎల్‌ఓ మాలేపాడు గ్రామపంచాయతీ సెక్రటరీ ఎస్.మనోహర్‌లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం కనబరచడంతో క్రమశిక్షణా చర్యల్లో భాగంగా కలెక్టర్ సస్పెండ్ చేశారన్నారు. ప్రతి వారం ఎన్నికల విధులపై సమీక్ష ఉంటుందని, తక్కువ ప్రగతి కనబరిచిన వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఆర్టీసీలోనే హెవీ డ్రైవింగ్‌లో ఉత్తమ శిక్షణ



హెవీ డ్రైవింగ్ సర్టిఫికెట్లను అందజేస్తున్న ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఇబ్రహీం

రాజంపేట: ఆర్టీసీలోనే హెవీ డ్రైవింగ్‌లో ఉత్తమ శిక్షణ ఇవ్వనున్నట్లు చిత్తూరు, అన్నమయ్య జిల్లాల డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఇబ్రహీం అన్నారు. మంగళవారం ఆయన రాజంపేట ఆర్టీసీ డిపో 12 బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న హెవీ డ్రైవర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీలో హెవీ డ్రైవింగ్ శిక్షణ పొందడం వల్ల భవిష్యత్తులో ఆర్టీసీలో ఉద్యోగం పొందే అవకాశం ఉందన్నారు. డిపో మేనేజర్ రమణయ్య మాట్లాడుతూ 13వ బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 7382868298, 7382868169, 7382868536, 9491415957 డ్రైవింగ్ స్కూల్ నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కృష్ణమూర్తి, ఈయూ రీజినల్ నేత మోడపోతుల రమణయ్య, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డీఎస్సీ 98 అభ్యర్థులకు కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో డీఎస్సీ 1998లో ఎస్‌జీటీగా క్వాలిఫై అయిన అభ్యర్థులకు బుధవారం కడప డీఈఓ కార్యాలయంలో కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. కాంట్రాక్టు బేసిస్‌లో మినిమం టైం స్కేల్ కింద పనిచేయుటకు ఆసక్తి కనబరిచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరై కన్ఫర్మ్ అయిన అభ్యర్థులంతా తప్పని సరిగా కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. కడప జిల్లాలో 172 ఎస్‌జీటీ పోస్టుల నియామకం జరుపనున్నట్లు తెలిపారు. డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు కడప డీఈఓ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచి జాబితాలో ఉన్న అభ్యర్థులు క్రమసంఖ్య 1 నుంచి 172 వరకు అభ్యర్థులంతా డీఈఓ కార్యాలయంలో తప్పక హాజరుకావాలని తెలిపారు. అభ్యర్థులు వారి వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్ కార్డు, 3 సెట్లను పాస్‌పోర్టు సైజు ఫోటోలతో కౌన్సిలింగ్ కేంద్రానికి ఉదయం 10 గంటలకు హాజరు కావాలని డీఈఓ తెలిపారు.

సర్టిఫికెట్ల పరిశీలన

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తూ మృతి చెందిన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఆరు జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి మంగళవారం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. డిప్యూటీ సీపీఎం రాజా గజలక్ష్మి, కర్నూలు డిప్యూటీ సీఎంఈ రజియా సుల్తాన, అనంతపురం పర్సనల్ ఆఫీసర్ చెంద్రాయుడు జోన్ వ్యాప్తంగా 41 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా ఉద్యోగాలకు సంబంధించిన డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థుల అన్ని సర్టిఫికెట్లను పరిశీలించామన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి 10, కర్నూలు 14, అనంతపురం జిల్లాకు చెందిన 17 మంది సర్టిఫికెట్ల పరిశీలకు వచ్చారన్నారు. వీరిలో అర్హులైన వారిచే ఆయా పోస్టులను భర్తీ చేయనున్నామన్నారు. పరిశీలనకు వచ్చిన సర్టిఫికెట్లను ఉన్నతాధికారులకు పంపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అల్లాబకష్, జేసీ శేఖర్, పీఓ రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి కృషి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా అధికారుల దృష్టికి తీసుకురావాలని డీవీఎంసీ కమిటీ సభ్యులకు సూచించారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి మొత్తం 16 కేసులలో 11 కేసులకు రూ. 4.50 లక్షలు నగదు మంజూరైందన్నారు. మిగిలిన కేసులు పురోగతిలో ఉన్నాయన్నారు. అలాగే మరో 90 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్ కమల్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సాంఘిక సంక్షేమశాఖ, సాధికారత జిల్లా అధికారి జాకీర్ హుస్సేన్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప, రాయచోటి, మదనపల్లి ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, డీఎస్పీలు, ఎస్సీ, ఎస్టీ జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సదాశివకుమార్, అంజనప్ప, శివశంకర్, కె.వెంకటరమణ, డి.వెంకటరమణ, ఐ ఈశ్వరయ్య, ఎస్.ఫరీదా, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

ఈవీఎంల భద్రతకు అధిక ప్రాధాన్యం

రాయచోటి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల రక్షణ, భద్రతకు అధికా ప్రాధాన్యం ఇస్తామని కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. మంగళవారం విజయవాడలోని ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి నూతన జిల్లాలలో ఈవీఎంలు భద్రపరచడానికి అవసరమైన గోడౌన్ల ఎంపిక అంశంపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాయచోటి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఇటీవల నూతనంగా నిర్మించిన భవనాన్ని ఈవీఎంలను భద్రపరచడానికి గోడౌన్ కోసం పరిశీలించామన్నారు. ఈవీఎంలను భద్రపరచడానికి ఇది అనుకూలంగా ఉంటుందని వివరించారు. మరో రెండు భవనాలను కూడా ప్రత్యామ్నాయంగా పరిశీలించామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అన్ని విషయాలను దృష్టిలో ఉంచుకొని ఈవీఎంలను భద్రపరిచే గోడౌన్ వివరాలను ఈనెల 12 బుధవారం కల్లా కమిషన్‌కు నివేదిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జ్యోతిబా పూలే

రాయచోటి : అందరికీ ఆదర్శప్రాయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. మంగళవారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని మాండవ్యనది హైలెవెల్ బ్రిడ్జి వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి 197వ జయంతి సందర్భంగా కలెక్టర్ గిరీషా పీఎస్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పూలే చిత్రపటానికి కూడా కలెక్టర్ పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే జీవితం నుంచి మనందరం చాలా నేర్చుకోవాల్సి ఉందన్నారు. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమాజంలో మహిళలు చదువుకోవడం ఎంతో ఆవశ్యకమని గుర్తించి ఆ దిశగా మొదట తన సతీమణికే విద్యను నేర్పించి మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా పూలే తీర్చిదిద్దారన్నారు. వేడుకలలో మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, బీసీ సంఘం నాయకులు విజయభాస్కర్‌లు మాట్లాడారు. అలాగే జ్యోతిరావుపూలే విగ్రహానికి రాయచోటి మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప, బీసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలోడీఆర్‌ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వెంకటరమణ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ నాగభూషణం, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, వాల్మీకి, మేదర సంఘం జిల్లా అధ్యక్షులు యోగానందబాబు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఓబులవారిపల్లె: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల(బాలురు)లో 5,6,7 తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఆంజనేయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని విద్యార్థులు 2023–24 సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా htpps://aprs.apcfss.inకు ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 8374685454 నంబరులో సంప్రదించాలని కోరారు.

తుదిదశకు లోకాయుక్త విచారణ

- హార్సిలీహిల్స్ సొసైటీ భూములపై సమగ్ర దర్యాప్తు
- రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలపై పూర్తిస్థాయి వివరాలు సేకరణ
- త్వరలో జస్టిస్ లక్ష్మణరెడ్డికి నివేదిక

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి 1974లో ప్రభుత్వం విక్రయించిన భూముల స్థితిగతులపై సమగ్ర విచారణ తుదిదశకు చేరుకుంది. గతేడాది ఆగస్టులో సొసైటీ భూములపై సమగ్ర దర్యాప్తునకు లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆదేశిస్తూ లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ (దర్యాప్తు) గంగరాజును నియమించారు. ఎన్నో చిక్కుముళ్లతో నిండిన సొసైటి భూముల వ్యవహారంపై అధ్యయనానికే చాలా రోజులు పట్టింది. రికార్డులు, కోర్టు కేసులపై అవగాహన పెంచుకున్నాకే క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించాల్సి వచ్చింది. విచారణ కోసం బి.కొత్తకోట తహసీల్దార్, మదనపల్లె సహకార డిప్యూటీ రిజిస్ట్రార్‌లను గంగరాజుకు సహాయకులుగా కలెక్టర్ నియమించారు. సుదీర్ఘంగా సొసైటీ భూముల వ్యవహారంపై జరిగిన విచారణ ముగింపు దశకు వచ్చింది. ఈ నేపథ్యంలో విచారణలో కీలకమైన విషయాలు, ఆక్రమణల వ్యవహారం వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది. స్టేలు ఉన్నట్టు, తమ భూమిగా చెప్పుకొంటూ కొందరు చేపట్టిన ఆక్రమణల గుట్టు బట్టబయలైనట్టు తెలుస్తోంది. 1980 దశాబ్దంలో ప్లాట్లు పొందిన కొందరు, ఓ వ్యక్తిచేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేపట్టారు.

వెలుగులోకి వాస్తవాలు..

1974 నవంబర్ 30న అప్పటి ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి హార్సిలీహిల్స్‌పై 20.60 ఎకరాలను కట్టబెట్టగా మార్కెట్ ధరను చెల్లించి భూమి స్వాధీనం చేసుకున్నారు. 1979 నుంచి 1985 మధ్యలో సభ్యులకు బినామీలు, ఒకే కుటుంబానికి చెందినవారి పేరిట, లేని వ్యక్తుల పేర్లతో ప్లాట్లు కేటాయించారన్న ఆరోణలపై వాస్తవాలు వెలికితీసినట్టు సమాచారం. కోర్టు స్టే ఉన్నట్టు కొన్నేళ్లుగా ప్రచారంలో ఉన్న సొసైటీకి చెందిన ఆక్రమిత భూమిపై స్టే లేదని వెలుగుచూసింది. 2007లో సహకార అధికారి డాక్టర్ పీఎస్‌వీ రామాంజనేయులు దర్యాప్తులో వెలుగుచూసిన అవినీతి, అక్రమాల ఆధారంగా కేసు నమోదుకు అప్పటి మదనపల్లె డివిజనల్ సహకార అధికారి లక్ష్మీ బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని ఆరా తీశారు. సొసైటీకి ప్రభుత్వం విక్రయించిన భూములు సొసైటికే చెందుతాయని 2013లో సీసీఎల్‌ఓ తీర్పు చెప్పింది. దీనిపై రెవెన్యూ అధికారులు హైకోర్టును ఆశ్రయించగా కేసు నడుస్తోంది. దీనితోపాటు ప్రైవేటు వ్యక్తుల మధ్య నడుస్తున్న కోర్టు కేసులు, వారి వివరాలను సేకరించి పరిశీలించారు. **సొసైటీ ప్రారంభం నుంచి** ఏయే చైర్మన్ల పాలనలో ఎవరెవరికి ప్లాట్లు కేటాయించారు, ప్రస్తుతం వాటి పరిస్థితి. ఆదాయ, వ్యయాలు, నిర్వహణ రికార్డుల పరిశీలన సమగ్రంగా పూర్తయింది. 1980లలో సినీ తారలకు కేటాయించిన ప్లాట్లపైనా విచారణ జరిగింది. సొసైటీ ఇప్పటి వరకు అధికారికంగా చేసిన రిజిస్ట్రేషన్లు, కేటాయింపులు పోను కేటాయింపు లేకుండానే ఆక్రమణకు గురైన భూమి వివరాలు ఆరా తీసి, ఆక్రమణదారులను ప్రశ్నించి వివరాలు రాబట్టినట్టు తెలిసింది.



హార్సిలీహిల్స్ (ఫైల్)

రెవెన్యూ ద్వారా వివరాలు

హార్సిలీహిల్స్ సొసైటీ భూములపై రెవెన్యూ అధికారులు వివరాలు సమర్పించినట్టు తెలిసింది. భూములకు సంబంధించి వివాదం, కోర్టుకేసులు, సీజ్ చేసిన ఆస్తులు ప్రస్తుత తాజాస్థితిపై వివరాలు అందించినట్టు సమాచారం. సహకారశాఖ అధికారులు కూడా తమ పరిధిలోని సమాచారం, వివరాలు అందించినట్టు తెలిసింది. ప్రధానంగా లోకాయుక్త విచారణకు కారణమైన ఫిర్యాదుదారుని ద్వారా విచారణ అధికారి గంగరాజు వివరాలు రాబట్టినట్టు తెలిసింది. దీనిపై విచారణ అధికారి గంగరాజు మాట్లాడుతూ విచారణ పూర్తి చేస్తున్నామని చెప్పారు. పలుకోణాల్లో దర్యాప్తు చేశామని, వివరాలను సేకరించామని తెలిపారు. పూర్తి నివేదికను లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డికి అందజేస్తామన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: డీపీఓ

రామసముద్రం: అధికారులు, సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి, ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం , అంగన్‌వాడీ కేంద్రం, మాలేనత్తం పంచాయతీలోని గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, తల్లులు, పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం అందరికీ సకాలంలో అందించాలన్నారు. అంగన్‌వాడీలలో పిల్లల సంఖ్య మరింత పెరిగేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాలేనత్తం పంచాయతీ సర్పంచ్ కొండూరు శ్రీనాథరెడ్డి, ఉప్పినెల్లి, మాలేనయ్యం గ్రామం వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైందని, మరమ్మతులు చేయాలని డీపీఓకు విన్నవించారు. ఈఓపీఆర్డీ చలపతిరావు, ఏసీడీపీఓ అమరజ్యోతి, సూపర్‌వైజర్లు రమాదేవి, సుగుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలిపోయిన చీనీ చెట్ల పరిశీలన

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామంలో అగ్ని ప్రమాదంలో కాలిపోయిన చీనీ చెట్లను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహా మండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. పంచాయతీ సర్పంచ్ అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ నేత రామిరెడ్డిల చీనీ తోట మంగళవారం దగ్ధమైంది. సుమారు 200 చీనీ చెట్లు, 40 నేరేడు చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. అలాగే పొలంలోని డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి వుంది. రాత్రి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహా మండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి కాలిపోయిన తోటను పరిశీలించారు. బాధితులతో వారు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

10 రోజుల్లో రెండు వాహనాల చోరీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులో 10 రోజుల వ్యవధిలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. భజంత్రి గణేష్ 10 రోజుల క్రితం ఇంటి ఎదురుగా నిలిపి ఉన్న స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. గత రాత్రి రామాచారి వాహనం అపహరణకు గురైంది. పోలీసులు రాత్రి వేళ గస్తీ నిర్వహించడంలో విఫలం కావడంతోనే చోరీలు అధికం అవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని వారు కోరుతున్నారు.

స్కూటర్ల దొంగ అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు

రాయచోటి టౌన్ : వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 8 స్కూటర్లను దొంగలించిన కేసులో నిందితుడిని రాయచోటి అర్బన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అర్బన్ సీఐ సుధాకరరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి – గాలివీడు రోడ్డు మార్గంలోని పొదలపల్లె సమీపంలో శ్రీ సత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలం గోకనపల్లెకు చెందిన షేక్ దర్బార్ వలిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 8 స్కూటర్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, కదిరిలో రెండు, చింతక్మొదిన్నెలో ఒకటి స్కూటర్ల దొంగతనం కేసులు నమోదు అయ్యాయి. అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

రిమ్స్‌కు మరో 19 పీజీ వైద్య సీట్లు

కడప అర్బన్ : ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల(రిమ్స్)కు తాజాగా మంగళవారం మూడు విభాగాల్లో 19 పీజీ వైద్య విద్య సీట్లు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ ఆధ్వర్యంలో ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు, వైద్య బృందం ప్రిన్సిపాల్ చాంబర్‌లో కేక్ కట్ చేసి ఆనందోత్సాహాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విలేకరులతో మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఆధ్వర్యంలో 11 విభాగాల్లో జరిపిన పరిశీలనల్లో 71 పీజీ సీట్లు మంజూరు కావాల్సి వుండగా.. ఇప్పటి వరకు నాలుగు విభాగాల్లో 28 పీజీ సీట్లు మంజూరయ్యాయన్నారు. మంగళవారం మూడు విభాగాలలో 19 పీజీ సీట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఇందులో ఫోరెన్సిక్ విభాగానికి 5, మైక్రోబయాలజీ విభాగానికి 9, పల్మనాలజీ విభాగానికి 5 పీజీ సీట్ల చొప్పున మంజూరయ్యాయన్నారు.



కేక్ కట్ చేసి ఆనందం పంచుకుంటున్న రిమ్స్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

దీంతో ఇప్పటి వరకు ఏడు విభాగాల్లో 47 పీజీ సీట్లు మంజూరయ్యాయన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచే ఈ 47 పీజీ సీట్లకు సంబంధించి అడ్మిషన్లు జరుగుతాయన్నారు. 2006లో ప్రారంభమైన రిమ్స్ ఎంబీబీఎస్ వైద్య విద్యా సంవత్సరం, 2013 లో పీజీ వైద్య విద్యా కోర్సులు ఆరంభమయ్యాయన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వర కు 10 విభాగాల్లో 44 పీజీ సీట్లు వుండగా, మొత్తం 17 విభాగాల్లో 91 పీజీ వైద్య విద్య సీట్లకు చేరుకున్నాయన్నారు. పెరిగిన పీజీ వై ద్య విద్య సీట్ల వల్ల వైద్య విద్యార్థుల్లో మరింత విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడం జరుగుతుందన్నారు. సమాజానికి మెరుగైన వైద్య సేవలు ఈ పీజీ సీట్ల ద్వారా సాధ్యమవుతుందని ప్రిన్సిపాల్ ఆనందం వ్యక్తం చేశారు. కడప రిమ్స్ వైద్య కళాశాల 2006లో స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు 91 పీజీ వైద్య విద్య సీట్లకు అనుమతి లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీంతో పీజీ వైద్య విద్యను అభ్యసించే వైద్య విద్యార్థులకే కాక, జిల్లా వాసులకు, చుట్టుపక్కల జిల్లాల వాసులందరికీ మెరుగైన వైద్య సేవలను అందించడమనేది గొప్పగా భావిస్తున్నామన్నారు. ఫోరెన్సిక్ వైద్య విభాగంలో ఐదు పీజీ సీట్లు రావడం వల్ల ప్రజలకు, సమాజానికి మెడికో లీగల్ సేవలు మ రింత విస్తృతమవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపా ల్ డాక్టర్ లక్ష్మీబాయి, ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ నాయక్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శంకర్ రెడ్డి, ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించారు. కురబలకోట మండలం అంగళ్లు ఆర్‌అండ్‌బీ కాలనీకి చెందిన రెడ్డిబాషా (55) స్థానికంగా మటన్‌షాపు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెంది సోమవారం రాత్రి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన వి.మౌనిక (28) కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెంది సోమవారం రాత్రి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన రెడ్డెమ్మ (50) కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం కుటుంబ కలహాల కారణంగా మనస్తాపం చెంది ఇంట్లోనే విషపు గుళికలు తిని ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలిని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

లారీ బోల్తా.. క్లీనర్ దుర్మరణం

గుర్రంకొండ : కోళ్ల లోడ్‌తో వెళుతున్న మినీ లారీ బోల్తా పడటంతో క్లీనర్ దుర్మరణం చెందగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన గుర్రంకొండలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రాయచోటికి చెందిన మినీ లారీ మంగళవారం వాల్మీకిపురం వద్దకు చేరుకుంది. అక్కడ కోళ్ల ఫారమ్‌లో కోళ్లను లారీలో లోడ్ చేసుకొని తిరిగి రాయచోటికి బయలుదేరింది. మార్గంమధ్యలో స్థానిక మార్కెట్ యార్డుకు చేరుకోగానే వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈసంఘటనలో వైఎస్సార్ జిల్లా వేంపల్లెకు చెందిన క్లీనర్ షేక్ హుస్సేన్ షా(44) అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా డ్రైవర్ చిన్నాకు తీవ్ర గాయాలు కావడంతో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు.



మృతి చెందిన హుస్సేన్‌షా

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

పుల్లంపేట : మండల పరిధిలోని అప్పయ్య రాజుపేట వద్ద మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మండల పరిధిలోని ఆర్ గొల్లపల్లి గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి(58) మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

మామిడి తోట దగ్ధం

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని పెద్ద కాల్వపల్లెలో మంగళవారం మామిడి తోట దగ్ధమైంది. రైతు నిమ్మనపల్లె శ్రీనివాసులరెడ్డి తోటలోని 100 మామిడి చెట్లు, 80 టేకు చెట్లు, కొబ్బరి చెట్లు, డ్రిప్ పైపులు కాలి బూడదయ్యాయి. బాధిత రైతు సమాచారం అందించిన వెంటనే ఫైర్ స్టేషన్ అధికారులు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినా అప్పటికే తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రమాదానికి గల స్పష్టమైన కారణాలు తెలియరాలేదు.



మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది

రెండు రోజుల వ్యవధిలో..

మైదుకూరు : మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో సోమవారం లక్ష్మీనారాయణ అనే రైతుకు చెందిన చెరకు తోట నిప్పంటుకొని కాలిపోగా, మంగళవారం ముసలినాయునిపల్లెకు చెందిన రైతు బండి పెద్ద తిరుమలయ్య సాగు చేసిన అరటి తోట అగ్నికి ఆహుతయ్యింది. 5 ఎకరాల్లో సాగైన అరటి వారంలో కోతకు రావాల్సి ఉంది. సమీప బీడు పొలంలో ఎండు పసుపాకులకు పెట్టిన నిప్పు అరటి తోటను అంటుకుంది. కోతకొచ్చిన అరటి గెలలు సుమారు రెండెకరాల్లోనివి కాలిపోయినట్టు బాధిత రైతు తిరుమలయ్య తెలిపారు. మైదుకూరు అగ్నిమాపక కేంద్రం అధికారి శివప్ప, సిబ్బంది శివ, మాబురెడ్డి, గౌస్, శివ సకాలానికి చేరుకుని మిగిలిన విస్తీర్ణంలోని పంట కాలిపోకుండా మంటలను ఆర్పివేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

సంబేపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సంబేపల్లె మండల కేంద్రంలో మంగళవారం ఐచర్ వాహనం దూసుకెళ్లడంతో లోహిత్‌రెడ్డి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన చోటు చేసుకుంది. శంకరాపురానికి చెందిన లోహిత్‌రెడ్డి సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై వెళుతుండగా పోలీస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే.. దేవపట్ల వైపు నుంచి ఐచర్ వాహనం వేగంగా వచ్చి ముందు వెళుతున్న బొలేరోను ఢీకొని లోహిత్‌రెడ్డి ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇళ్లలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లోహిత్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాహన చక్రంలో కాలు పెట్టడంతో..

మదనపల్లె : కురబలకోట మండలం బైసానివారిపల్లెకు చెందిన రామచంద్రారెడ్డి (65) తనకు పరిచయస్తుడైన రామస్వామి (64)తో కలిసి ద్విచక్రవాహనంలో మంగళవారం మదనపల్లె నుంచి ముదివేడుకు బయలుదేరారు. ముదివేడు క్రాస్ వద్ద రామచంద్రారెడ్డి ప్రమాదవశాత్తు కాలు వాహన చక్రంలో పెట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు దాటుతుండగా..

మదనపల్లె : ఓ రైతు రోడ్డు దాటుతుండగాగా, బొలేరో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన బి.వి.కృష్ణప్ప (62) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి మదనపల్లె మండలం మొలకలదిన్నెకాస్‌లో నివసిస్తున్న కుమారుడు మణి ఇంటికి వచ్చాడు. బస్సు దిగి రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన బొలేరో ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణప్ప తీవ్రంగా గాయపడ్డాడు.

ఆర్వోబీ నిర్మాణానికి సహకరించాలి

మదనపల్లె : మదనపల్లె–తిరుపతి ఎన్‌హెచ్–71 నిర్మాణంలో భాగంగా సీటీఎం వద్ద నిర్మించ తలపెట్టిన ఆర్వోబీ(రోడ్ ఓవర్ బ్రిడ్జి)కు భూ నిర్వాసితులు సహకరించాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ కోరారు. స్థానిక సబ్ కలెక్టరేట్‌లో మంగళవారం సీటీఎం ఆర్వోబీకు సంబంధించి భూములు కోల్పోతున్న రైతులు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులతో పరిహారానికి సంబంధించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మదనపల్లె–తిరుపతి మార్గంలో విపరీతమైన ట్రాఫిక్, ప్రమాదాల కారణంగా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు స్థానికులు చేసిన విజ్ఞప్తి మేరకు ఆర్వోబీ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించారన్నారు. ఇందులో భాగంగా సీటీఎంలో 4.90 ఎకరాలు, కొత్తవారిపల్లె పంచాయతీలో 1.75 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించి మార్కింగ్ చేశామన్నారు. దీనికి సంబంధించి భూములకు మార్కెట్ బేసిక్ విలువ ప్రకారం రూ.12 లక్షలు ప్రభుత్వ పరిహారం ధర కాగా, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నందున, విలువైన స్థలాలు కావడంతో రెండున్నర శాతం పెంచి ఎకరాకు రూ.32 లక్షలు పరిహారం నిర్ణయించామన్నారు. అలాగే ఇళ్లకు సంబంధించి చదరపు గజానికి రూ.4.190 ప్రభుత్వ ధర కాగా, కుంటకు రూ.5,20,000 పరిహారం ప్రకటించామన్నారు. భూములు, ఇళ్ల యజమానులు తమ ఆస్తులకు సంబంధించిన రికార్డులను వీఆర్వో లేదా తహసీల్దార్‌లకు అందిస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి అనుమతులు వచ్చిన వెంటనే డబ్బులు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఈ సందర్భంగా సీటీఎం సర్పంచ్ ఆనందపార్థసారధి, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర.. అభివృద్ధిలో భాగంగా ఆర్వోబీ నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని, ప్రభుత్వం నిర్ణయించిన పరిహారాన్ని పెంచి ఇవ్వాల్సిందిగా కోరారు. ఇళ్లు కోల్పోతున్న వారికి పరిహారంతోపాటుగా ప్రభుత్వ స్థలాలను మంజూరు చేయాల్సిందిగా వినతి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీకే శ్రీనివాసులు, సింగిల్‌విండో డైరెక్టర్ వీరప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీ

గంజాయి ముఠా ఆటకట్టు

గుర్రంకొండ : గుర్రంకొండలో గంజాయి ముఠా సభ్యుల్ని 12 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక జీవన్‌తోపు వద్ద ఉన్న ఓ బండ వద్ద పెద్ద ఎత్తున గంజాయి విక్రయించడంతోపాటు పలువురు సేవిస్తున్నారనే సమాచారం అందుకొన్న పోలీసులు రాయచోటి డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. పలువురు బండపై ప్లాస్టిక్ సంచుల్ని కలిగి పారిపోవుట ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి మొత్తం 12 మందిని అదుపులోకి తీసుకొన్నారు. తహసీల్దార్ ఖాజాబీ అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు. విష్ణువర్ధన్(21) మదనపల్లె, పటాన్ సల్మాన్‌ఖాన్(21) గుర్రంకొండ, సయ్యద్‌బారో(21) గుర్రంకొండ, కె.ఆదిల్(19) గుర్రంకొండ, షేక్ మస్తాన్(21) గుర్రంకొండ, కురాకుల మహేష్(24) మదనపల్లె, కె.మల్లయ్య(59), పి.రాజేష్‌రెడ్డి(31) రేణిగుంట, తిరుపతి జిల్లా, కె.మునిసాయి(24) బుచ్చినాయుడు కండ్రిగ, చిత్తూరు జిల్లా, పి.శివకుమార్‌రెడ్డి(33) మదనపల్లె, గుర్రంకొండకు చెందిన లాతీక్(21), రెడ్డిప్రసాద్(22)పై కేసు నమోదు చేసినట్లు రాయచోటి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. వారి వద్ద నుంచి 12 సెల్ ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలు, రూ.5000 స్వాధీనం చేసుకొన్నామని ఆయన పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కలకడ సీఐ నాగేంద్ర, గుర్రంకొండ ఎస్‌ఐ దిలీప్‌కుమార్, సిబ్బందికి రివార్డులు అందజేస్తామన్నారు.



గంజాయి ముఠా సభ్యుల అరెస్ట్ చూపుతున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

ఇద్దరు యువకులపై కేసు నమోదు

మదనపల్లె : వీధిలో గొడవ పడుతూ హంగామా సృష్టించి స్థానికులకు ఇబ్బంది కలిగించిన ఇద్దరు యువకులపై పబ్లిక్ న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కొత్తపల్లె పంచాయతీ ఈశ్వరమ్మ కాలనీకి చెందిన మన్సూర్‌బాషా, రాంచరణ్ సోమవారం రాత్రి నగదు విషయమై వీధిలో గొడవపడ్డారు. నానా హంగామా సృష్టించి ఒకరినొకరు దూషించుకుంటూ స్థానికులకు ఇబ్బంది కలిగించారు. దీంతో గొడవపై స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

కలసపాడు : ఓ విద్యార్థి ఈతకు వెళ్లి మృతి చెందడంతో తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలింది. కలసపాడు మండలంలోని పిడుగుపల్లెకు చెందిన కొమ్మాలపాటి వసంతశేఖర్, నారాయణమ్మ కుమారుడు దినేష్ (14) మంగళవారం ఈతకు వెళ్లి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దినేష్ కాశినాయన మండలంలోని వంకమర్రి సగిలేరు గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతుండే వాడు. దినేష్ తన స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని చెరువులోకి ఈతకు వెళ్లాడు. చెరువు లోతు ఎక్కువగా ఉండటంతో ఈత కొట్టలేక మునిగిపోతుండగా గమనించిన తోటి విద్యార్థులు బంధువులకు అందించారు. వారు వచ్చి చెరువులో నుంచి దినేష్ బయటికి తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పచ్చదనాన్ని పెంచాలి

సిద్దవటం: తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో పచ్చదనాన్ని పెంపొందించాలని తహసీల్దారు శంకర్‌రావుకుక ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతు పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దారు కార్యాలయం గోడల వద్ద ఏర్పాటు చేసిన బంకులను ఎత్తివేయాలన్నారు. ఎంతో మహర్దశను సంతరించుకున్న సిద్దవటం నాడు జిల్లా కేంద్రంగా కొనసాగిందని అప్పట్లో జిల్లా కలెక్టర్‌గా సర్ థామస్ మన్రో కొనసాగేవారన్నారు. కార్యాలయంలోని రికార్డు రూమును పరిశీలించిన ఆయన బ్రిటీష్ హయాంలో నిర్మించిన రికార్డు రూము చూడముచ్చటగా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దారు శంకర్‌రావు, డిప్యూటీ తహసీల్దారు రాజేష్‌క్రిష్ణ, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



పనులను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

సచివాలయం తనిఖీ

సంబేపల్లె : మండల కేంద్రంలోని సచివాలయాన్ని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి మనోహర్‌రాజు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో మరిన్ని సేవలు పెంచాలి, సర్వేలు సక్రమంగా చేయాలన్నారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న మనోహర్‌రాజు

నూతన ఒరవడి

- కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో కలెక్టరేట్‌కు ఏర్పాట్లు
- అందులో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండేలా చర్యలు
- రాయచోటి రింగ్‌రోడ్డు సమీపంలో 60 ఎకరాల స్థల సేకరణ
- ప్రస్తుత పాత కలెక్టరేట్ ఆనుకుని కలెక్టర్, జేసీ, డీఆర్వో బంగ్లాలు

సాక్షి, రాయచోటి : పునర్విభజనలో భాగంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఇప్పుడిప్పుడే వసతులు సమకూరుతున్నాయి. జిల్లా ఇప్పటికే అభివృద్ధి బాట పట్టగా... మరి కొన్ని ప్రగతి పనులు ప్రతిపాదన దశలో ఉన్నాయి. కొత్తగా జిల్లా ఏర్పడినప్పటికీ ఏడాది కాలంలోనే అన్ని మౌలిక సదుపాయాలతోపాటు ఇతర అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు కంకణం కట్టుకుని ముందుకు వెళుతున్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు అన్ని నియోజకవర్గాల్లోనూ అవసరానికి తగ్గట్టుగా బాటలు వేస్తున్నారు. అలాగే అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో నూతన కలెక్టరేట్‌తోపాటు ఇతర కార్యాలయాల భవనాల సముదాయానికి స్థలాన్ని ఎంపిక చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం కొనసాగుతున్న కలెక్టరేట్ వెనుక వైపునే ఉన్నతాధికారుల బంగ్లాల నిర్మాణానికి పథక రచన చేశారు.

జిల్లా కేంద్రానికి కొత్త కలెక్టరేట్

కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాకు సంబంధించి అన్ని వసతులు కల్పించేందుకు అధికార యంత్రాంగం పథక రచన చేసింది. ప్రత్యేకంగా కలెక్టరేట్‌తోపాటు అన్ని కార్యాలయాలు ఒకే ప్రాంతంలో ఉంటే.. ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి జిల్లా కలెక్టర్ గిరీషా, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి నూతన కలెక్టరేట్ సముదాయానికి అవసరమైన 60 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు.

కలెక్టరేట్ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నారు. నూతన కలెక్టరేట్ భవనాలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, హెచ్‌ఓడీల ఆఫీసులు, కలెక్టర్, ఎస్పీ, జేసీ, డీఆర్వో తదితర అధికారుల భవనాల నిర్మాణాలకు స్థలాన్ని ఎంపిక చేశారు. రాయచోటి రింగ్‌రోడ్డులోని వేంపల్లె–గాలివీడు రహదారి సమీపంలో స్థలాన్ని నూతన కలెక్టరేట్‌కు ఎంపిక చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా ప్రత్యేకంగా కలెక్టరేట్ ప్రాంతాన్ని పరిశీలించడంతోపాటు పూర్తిగా అవసరమైన భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇక్కడే కలెక్టరేట్‌తోపాటు అన్ని ప్రభుత్వ భవనాల సముదాయాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



కొత్త కలెక్టరేట్ ప్రభుత్వ భవనాల సముదాయానికి ఎంపిక చేసిన స్థలం

ప్రస్తుత కలెక్టరేట్ పక్కనే బంగ్లాల నిర్మాణం

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ వెనుకభాగాన్ని ఉన్నతాధికారుల బంగ్లాల నిర్మాణాలకు స్థల ఎంపిక చేశారు. కలెక్టర్, జేసీ, డీఆర్వో బంగ్లాలకు సుమారు 8 ఎకరాల స్థలాన్ని కేటాయించి చదును చేశారు. బండ రాళ్లను పూర్తిగా తొలగించి సరిచేయడంతోపాటు ప్రత్యేకంగా ఎంపిక చేసిన స్థలం చుట్టూ హద్దులు గుర్తించి చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు.

ఒకే చోట ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం



రాయచోటిలోని రింగ్‌రోడ్డు సమీపంలో నూతన కలెక్టరేట్ నిర్మాణాలకు స్థల ఎంపిక చేశాం. కలెక్టరేట్ భవనాలతోపాటు ఎస్పీ, జేసీ, ఇతర అన్ని శాఖల కార్యాలయాలు నిర్మించనున్నాం. అందుకోసం సుమారు 60 ఎకరాల స్థలాన్ని కేటాయించి చదును చేసే కార్యక్రమం చేపడుతున్నాం. ప్రస్తుతమున్న కలెక్టరేట్ ప్రక్కనే కలెక్టర్, జేసీల బంగ్లాలు నిర్మించనున్నాం. అందుకు సంబంధించి త్వరలో శంకుస్థాపన చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. అభివృద్ధిలో అన్నమయ్య జిల్లాను అగ్రగామిగా నిలపడమే లక్ష్యం. – పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా